బ్లాక్‌బెర్రీ ఐవోటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హైదరాబాద్‌లో బ్లాక్‌బెర్రీ ఐవోటీ సెంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 21: కెనడాకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్లాక్‌బెర్రీ లిమిటెడ్..హైదరాబాద్‌లో నూతన ఐవోటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. పూర్తిస్థాయిలో ఈ సెంటర్ అందుబాటులోకి వచ్చిందని, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఆసియా పసిఫిక్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు, ముఖ్యంగా బ్లాక్‌బెర్రీ క్యూఎన్ఎక్స్ గ్లోబల్ డెవలపర్ నెట్‌వర్క్‌గా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించింది. కెనడా తర్వాత సంస్థకు ఉన్న రెండో అతిపెద్ద ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) ఇదే కావడం విశేషం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ ఇంజినీరింగ్, క్లౌడ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇంటిగ్రేషన్, సర్వీసు డెలివరీ విభాగాల్లో ప్రతిభ ఉన్నవారిని రిక్రూట్ చేసుకుంటున్నది సంస్థ. భారత్‌లో వ్యాపారాన్ని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో ఐవోటీ సీవోఈని ప్రారంభించినట్లు, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అండ్ సర్వీసులకు పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఈ సెంటర్ పనిచేయనున్నదని తెలిపింది.

ఫోన్‌పే.. ఇండస్ యాప్‌స్టోర్

గూగుల్ ప్లే స్టోర్‌కు పోటీగా పరిచయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: దేశీయ వినియోగదారుల కోసం బుధవారం ఓ కొత్త మొబైల్ అప్లికేషన్ (మొబైల్ యాప్) స్టోర్‌ను పరిచయం చేసింది ఫోన్‌పే. గూగుల్ ప్లే స్టోర్‌కు పోటీగా వచ్చిన ఈ ఆండ్రాయిడ్ ఆధారిత స్టోర్‌ను ఇండస్ యాప్‌స్టోర్‌గా పిలుస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌గా భారత్ ఉన్నది. ఈ క్రమంలోనే పెరుగుతున్న మొబైల్ వినియోగాన్ని అందిపుచ్చుకుని సంస్థాగతంగా మరింత వృద్ధి చెందాలన్న ఆలోచనతో ఇండస్ యాప్‌స్టోర్‌ను ఫోన్‌పే తెచ్చింది. దీన్ని భారతీయ డిజిటల్ ప్రయాణంలో ఓ గొప్ప మార్పుగా ఫోన్‌పే అభివర్ణిస్తున్నది. ఈ కొత్త యాప్‌ను వినియోగదారులు సమర్థవంతంగా వాడుకునేలా ఓ షార్ట్-వీడియోను సైతం ఫోన్‌పే.. ఈ యాప్‌స్టోర్‌లో అందుబాటులోకి తీసుకురావడం విశేషం. మరోవైపు ఈ యాప్‌స్టోర్ వినియోగాన్ని పెంచేలా ఆయా స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలతోనూ భాగస్వామ్యానికి ఫోన్‌పే ప్రయత్నిస్తున్నది. ఇక ప్రత్యేకంగా భారతీయ మొబైల్ ఫోన్ బ్రాండ్‌ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ సందర్భంగా తెలిపారు.

- ఇండస్ యాప్‌స్టోర్‌లో 45 విభాగాల్లో 2 లక్షలకుపైగా మొబైల్ యాప్‌లు, గేమ్‌లు.
- 12 భారతీయ భాషల్లో సులభంగా గుర్తించే సౌలభ్యం.
- ఏడాదిపాటు డెవలపర్లు ఈ యాప్‌స్టోర్‌లో నమోదు చేసే తమ యాప్‌లకు చార్జీలను చెల్లించనక్కర్లేదు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1దాకా ఇది వర్తిస్తుంది.
- తమ వీలుకు తగ్గట్టు ఏ థర్డ్-పార్టీ పేమెంట్ గేట్‌వేనైనా డెవలపర్లు వాడుకోవచ్చు.

ఒకేరోజు 536 విమానాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మరో రికార్డును సృష్టించింది. జనవరి 30న ఒకేరోజు 536 విమానాలు రాకపోకలు సాగించాయి. ఒకేరోజు ఇన్ని విమాన సర్వీసులు రాకపోకలు సాగించడం ఇదే తొలిసారని జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వెల్లడించింది. అలాగే గత నెల చివరినాటికి విమాన ప్రయాణికుల సంఖ్య 2.07 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. జనవరి నెలలో 21.81 లక్షల మంది ప్రయాణించగా..ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 2.07 కోట్ల మంది ప్రయాణించినట్లు వెల్లడించింది.

పెరిగిన కస్టమర్లు

విమాన ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ రూపొందించిన డిజిటల్ యాప్‌నకు అపూర్వ స్పందన లభిస్తున్నది. సివిల్ ఏవియేషన్ రూపొందించిన ఈ యాప్ సేవలు ఇప్పటికే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అందుబాటులోకి వచ్చాయి. గతేడాది డిసెంబర్ నాటికి 10 లక్షల మంది ప్రయాణికులు వినియోగించుకోగా..తాజాగా ఈ నెల 11 నాటికి ఈ సంఖ్య 14,92,776కి చేరుకున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.45 కోట్ల ప్రయాణికులు డీజీయాత్రను వినియోగించినట్లుగా వెల్లడైంది.

జీసీసీలకు అడ్డా.. భారత్

దేశంవైపే విదేశీ సంస్థల చూపు: కొల్లీర్స్ ఇండియా • తక్కువ ఖర్చు.. ప్రతిభావంతులకూ కొదవే లేదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: దేశంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను ఏర్పాటు చేసేందుకు విదేశీ సంస్థలు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుస్తున్నాయి. భారత్‌లో నిర్మాణ రంగ వ్యయాలు తక్కువగా, నైపుణ్యం-ప్రతిభ కలిగిన ఉద్యోగుల లభ్యత ఎక్కువగా ఉండటం వల్లే ఆయా దేశాల్లోని కంపెనీలు తమ జీసీసీల కోసం ఇటువైపు చూస్తున్నాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొల్లీర్స్ ఇండియా అంటున్నది. 'భారత్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు-నూతన విశ్వాసం' పేరుతో బుధవారం ఓ నివేదికను కొల్లీర్స్ ఇండియా విడుదల చేసింది.

5 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) 4.5 నుంచి 5 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను విదేశీ కంపెనీలు లీజుకు తీసుకోవచ్చని కొల్లీర్స్ అంచనా వేస్తున్నది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో ఏ గ్రేడ్ కార్యాలయ స్థలాలకు డిమాండ్ మరింతగా ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అలాగే 2022-23లో దేశంలోని 6 ప్రధాన నగరాల్లో 3.95 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజుకు పోయిందని గుర్తుచేసింది. నిజానికి దేశీయ ఆఫీస్ స్పేస్ డిమాండ్‌లో 40 శాతం జీసీసీ కంపెనీలదేనని కొల్లీర్స్ పేర్కొన్నది.

- 2020 నుంచి దేశంలోని టాప్-6 నగరాల్లో దాదాపు 7.2 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్న జీసీసీ సంస్థలు. మొత్తం ఆఫీస్ స్పేస్ డిమాండ్‌లో ఇది 39 శాతానికి సమానం.

కాగా, దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ జీసీసీల ఏర్పాటును విదేశీ బహుళజాతి సంస్థలు పరిశీలిస్తున్నాయని చెప్తున్నది. అయితే ఇంకా వెంటాడుతున్న కరోనా భయాలు, అంతర్జాతీయ ఆందోళనకర పరిస్థితుల మధ్య కంపెనీలు జీసీసీల ఏర్పాటు విషయంలో వేచిచూసే ధోరణినే అవలంబిస్తున్నట్టు కొల్లీర్స్ తెలిపింది.

హైదరాబాద్‌దే హవా

దేశంలో జీసీసీలను ఏర్పాటు చేయాలని భావించిన విదేశీ కంపెనీలు.. హైదరాబాద్‌కే పెద్దపీట వేశాయి. ఈ క్రమంలోనే బెంగళూరు తర్వాత హైదరాబాదే ఎక్కువ జీసీసీలను అందిపుచ్చుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం నుంచి కూడా ఈ మేరకు కావాల్సిన సహకారం అందడంతో జీసీసీల హబ్‌గా హైదరాబాద్ నిలిచింది. ముఖ్యంగా నాటి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చొరవ కలిసొచ్చింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ, ముంబై, చెన్నై, అహ్మదాబాద్, పుణె నగరాలను దాటి హైదరాబాద్ నగరం దూసుకెళ్లినట్టు గత ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసిన నాస్కామ్ నివేదిక చెప్తున్నది.

- *జీసీసీల కోసం దేశీయంగా కార్యాలయ స్థలాలను లీజుకు తీసుకుంటున్న విదేశీ సంస్థల్లో అమెరికాకు చెందినవే 71 శాతం. వీటిలో ప్రధానంగా టెక్నాలజీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాలకు చెందినవి ఉన్నాయి. ఆ తర్వాత యూరోపియన్ యూనియన్‌కు చెందిన బహుళ జాతి జీసీసీ కంపెనీలున్నాయి.*
- *గత కొన్నేండ్లుగా భారత్‌లో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్/ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్న జపాన్, దక్షిణ కొరియా సంస్థలు.*

బైజూస్‌కు ఊరట

200 మిలియన్ డాలర్ల రైట్స్ ఇష్యూ పూర్తి

ముంబై, ఫిబ్రవరి 21: ఆర్థిక సంక్షోభంలో అల్లాడుతున్న ఎడ్‌టెక్ దిగ్గజం బైజూస్‌కు ఊరట లభించింది. కంపెనీ ప్రతిపాదించిన 200 మిలియన్ డాలర్ల (రూ.1,660 కోట్లు) రైట్స్ ఇష్యూ పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. బైజూస్ ప్రమోటింగ్ సంస్థ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యంత తక్కువ విలువకు ప్రస్తుత షేర్‌హోల్డర్లకు రైట్స్ షేర్లను ఆఫర్ చేసింది. ఒకానొక సమయంలో 22 బిలియన్ డాలర్ల గరిష్ఠస్థాయికి కంపెనీ విలువ చేరినప్పటికీ, దానికి 99 శాతం తక్కువ విలువతో రైట్స్ జారీచేసింది. తమ షేర్‌హోల్డర్లందరూ రైట్స్ ఇష్యూలో పాలుపంచుకున్నారని బైజూస్ వ్యవస్థాపకుడు, సీఈవో బైజూ రవీంద్రన్ తెలిపారు. రైట్స్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు ఒక థర్డ్ పార్టీ ఏజెన్సీని నియమించనున్నట్టు వెల్లడించారు. ప్రమోటర్లు మినహా ఇతర షేర్‌హోల్డర్లకు కంపెనీలో 30 శాతం వాటా ఉంది.

ఈజీఎంపై స్టేకు హైకోర్టు నిరాకరణ

పలు అవకతవకలకు పాల్పడిన బైజూస్ సీఈవో రవీంద్రన్, ఆయన కుటుంబాన్ని నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించేందుకు కొంతమంది థింక్ అండ్ లెర్న్ ఇన్వెస్టర్లు డిమాండ్ మేరకు ఫిబ్రవరి 23న జరగనున్న ఈజీఎంపై స్టే విధించేందుకు కర్నాటక హైకోర్టు బుధవారం నిరాకరించింది. ఈజీఎంపై స్టేను కోరుతూ బైజూస్ హైకోర్టును ఆశ్రయించింది. అయితే ఈజీఎంలో ఆమోదించిన ఎటువంటి తీర్మానాన్ని అయినా తదుపరి విచారణలోగా అమలు చేయరాదని కోర్టు ఆదేశించి ప్రమోటర్లకు కొంత ఊరటనిచ్చింది.

మారుతిపై డీఆర్ఐ దర్యాప్తు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీపై డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) దర్యాప్తు చేస్తున్నది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఓ విడిభాగానికి సంబంధించి హార్మనైజ్డ్ సిస్టమ్ ఆఫ్ నోమెన్క్లచర్ (హెచ్ఎస్ఎన్) కోడ్ తప్పిదంపై డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ విచారణ చేస్తున్నట్టు రెగ్యులేటరీకి బుధవారం మారుతీ సుజుకీ ఇండియా తెలిపింది. కాగా, దీనికి సమాధానం ఇస్తున్నామని, ఈ దర్యాప్తు వల్ల సంస్థకు ఆర్థికంగా, కార్యకలాపాలపరంగా, మరే రకంగా కూడా ఎటువంటి ప్రభావం ఉండబోదని మారుతీ చెప్పింది.

ప్రామాణికంగా కేవైసీ

అన్ని బ్యాంక్‌లూ ఒకేరీతిలో కస్టమర్ల వెరిఫికేషన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఆన్‌లైన్ అప్లికేషన్లపై జరుగుతున్న చట్టవిరుద్ధ రుణ వితరణను నిరోధించేక్రమంలో ఫైనాన్షియల్ రంగం అంతటా కస్టమర్ల వెరిఫికేషన్ ఒకే విధానంలో జరగాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ పరిధిలోని ఫైనాన్షియల్ స్టెబిలిటీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎఫ్ఎస్‌డీసీ) ప్రతిపాదన చేసింది. దేశంలోని ఫైనాన్షియల్ రెగ్యులేటింగ్ సంస్థలన్నింటికీ నేతృత్వం వహించే ఎఫ్ఎస్‌డీసీ బుధవారం తన ప్రతిపాదనను వెల్లడించింది. అయితే ఈ ప్రతిపాదన ఎప్పటినుంచి అమలయ్యేదీ స్పష్టం చేయలేదు. నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రస్తుత నిబంధనల్ని సమావేశంలో చర్చించి, వీటిని ప్రామాణీకరించాలని నిర్ణయించినట్టు ఎఫ్ఎస్‌డీసీ తెలిపింది. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు తదితర వివిధ ఆర్థిక సంస్థలు ప్రస్తుతం తమ ఖాతాదారులను వెరిఫై చేయడానికి వేరువేరు మార్గాలను అనుసరిస్తున్నాయి. ఈ ప్రక్రియను ప్రామాణీకరిస్తే ఫైనాన్షియల్ రంగం అంతటా కేవైసీ రికార్డులు పరస్పరం ఉపయోగించుకోవడం వీలుపడుతుందని కౌన్సిల్ వివరించింది. చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ లెండింగ్ యాప్స్‌తో కలిగే దుష్పరిణామాల్ని నిరోధించడానికి తగిన చర్యల్ని సమావేశంలో చర్చించినట్టు ఎఫ్ఎస్‌డీసీ ప్రకటన తెలిపింది. కొవిడ్ పాండమిక్ సమయంలో ప్రాచుర్యం పొందిన ఈ యాప్స్ అధిక వడ్డీలు విధిస్తూ, అనైతిక రికవరీ ప్రక్రియలతో వేధింపులకు పాల్పడుతున్నాయి.

త్వరలో కొత్త పారిశ్రామిక విధానం

- **ఎంఎస్ఎంఈలకు ప్లగ్ అండ్ ప్లే పాలసీ**
- **పారిశ్రామికాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నాం**
- **మహిళలకు ప్రత్యేక పారిశ్రామికవాడ..ఫార్మాకు రెడ్ జోన్‌లు**
- **రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



హైదరాబాద్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): సూక్ష్మ, చిన్న-మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) కోసం ప్రతిపాదిత నూతన విధానాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. చిన్నతరహా పరిశ్రమల కోసం ప్లగ్ అండ్ ప్లే పద్ధతిలో స్థలాలు కేటాయిస్తామన్న ఆయన..పరిశ్రమలకు భూములను లీజు పద్ధతిలో కేటాయిస్తామని, నిబంధనలకు లోబడి వాటిని రెగ్యులరైజ్ చేస్తామని చెప్పారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, ఐటీ రంగ విస్తరణకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటున్నదని, భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగించేందుకు నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్టు ఆయన ప్రకటించారు. ఆకాశాన్ని అంటుతున్న భూముల ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న తరహా పరిశ్రమలు స్థాపించేవారికి చిన్నచిన్న ప్లాట్లలో ప్లగ్ అండ్ ప్లే విధానంతో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పరిశ్రమ ఏర్పాటునకు ముందుకొచ్చేవారికి లీజు పద్ధతిలో వాటిని కేటాయించాలని నిర్ణయించినట్లు, దీనివల్ల చిన్నతరహా యూనిట్లు ఏర్పాటు చేసుకునేవారికి ఆర్థికభారం పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలవారీగా ఆయా ప్రాంతాల్లోని ముడి సరుకు ఆధారంగా చిన్న తరహా పారిశ్రామికవాడలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. బహుళజాతి కంపెనీలకు సర్కార్ ఎల్లప్పుడూ స్వాగతిస్తున్నదని, ఇటువంటి భారీ పరిశ్రమల ద్వారా ఎకోసిస్టం అభివృద్ధి చెంది పలు చిన్న స్థాయి సంస్థలకు దన్నుగా నిలువనున్నదన్నారు.

సబ్సిడీలపై అధ్యయనం..

పెట్టుబడులను ఆకట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నదని, ముఖ్యంగా సబ్సిడీలపై వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. కచ్చితంగా ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకంటే భిన్నంగా సబ్సిడీలు ఆశ్చర్యం కలిగించే విధంగా ఉంటాయని మంత్రి స్పష్టంచేశారు. రాష్ట్రంలో సమగ్ర పారిశ్రామికాభివృద్ధి కోసం కన్సల్టెంట్ చేత అధ్యయనం చేయిస్తున్నట్లు, ఈ నివేదిక వచ్చిన తర్వాత ఆయా ప్రాంతాల వారీగా పరిశ్రమల ఏర్పాటునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ వెలుపల, ఆర్ఆర్ఆర్‌కు సమీపంలో ఎటువంటి పరిశ్రమలను ఏర్పాటు చేయాలనేది దీని ద్వారా స్పష్టమవుతుందన్నారు.

ఫిల్మ్‌సిటీ వైపు జపాన్ పారిశ్రామికవాడ..

పరిశ్రమలన్నీ హైదరాబాద్ చుట్టు కేంద్రీకృతం కాకుండా జిల్లాలకు విస్తరించనున్నట్లు, ఇందులో భాగంగా ఈస్ట్‌జోన్ పరిధిలో ఎల్బీనగర్ వైపు జపాన్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. జపాన్‌కు చెందిన పలు భారీ పరిశ్రమలు రాష్ట్రంలో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్లు, వారికోసం రామోజీ ఫిల్మ్ సిటీ వైపు సుమారు 800ఎకరాల్లో ప్రత్యేకంగా జపాన్ పారిశ్రామికవాడను ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఐటీ సంస్థలను ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీధర్ బాబు తెలిపారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దీనికి డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులు ముందుకొచ్చారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో రెండు చోట్ల డ్రైపోర్టులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నల్గొండతోపాటు జహీరాబాద్ ప్రాంతంలో డ్రై పోర్ట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌కు చర్యలు..

హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటునకు తమ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని, ముఖ్యంగా ఐటీ పరిశ్రమలు ఒక్క వెస్ట్‌జోన్‌కే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు విస్తరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళలు స్వయంశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తమ ప్రభుత్వం సహకారం అందిస్తున్నదని, ఇందులో భాగంగా సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విధంగానే పూర్తిగా మహిళా పారిశ్రామికవేత్తలు ఉండే విధంగా ప్రత్యేక మహిళా పారిశ్రామికవాడను ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఒకేచోట కాలుష్యకారక పరిశ్రమల ఏర్పాటువల్ల కాలుష్య సమస్య ఉత్పన్నమవుతున్నదని, దీన్ని దృష్టిలో ఉంచుకొని 3 వేల ఏకరాల విస్తీర్ణంలో ఒక్కొక్కటి చొప్పున వివిధ ప్రాంతాల్లో ఏడెనిమిది ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

26 నుంచి బయో ఏషియా సదస్సు

ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్ వేదికగా బయో ఏషియా సదస్సు జరగబోతున్నది. ఈ అంతర్జాతీయ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. పరిశ్రమలను ఆకర్షించడంలో రాష్ట్రాల మధ్య పోటీ సహజంగానే ఉంటుందని, అలాగే కర్ణాటక, తెలంగాణ మధ్య కూడా పోటీ ఉన్నదన్నారు. కర్ణాటకకు వెళ్ళే జపాన్ సంస్థను ఒప్పించి తెలంగాణకు తెచ్చిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

400 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ • రికార్డు స్థాయి నుంచి నిఫ్టీ వెనక్కి

ముంబై, ఫిబ్రవరి 21: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడం, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం కూడా పతనానికి ఆజ్యంపోశాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో చివరి గంటలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా వరుసగా ఆరు రోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. లాభాల్లో ప్రారంభమైన సూచీలు సమయం గడుస్తున్న కొద్దీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో 73 వేల పైన కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 72,450 పాయింట్లకు జారిపోయింది. చివరకు 434.31 పాయింట్లు నష్టపోయి 72,623.09 వద్ద ముగిసింది. రికార్డు స్థాయిలో దూసుకుపోయిన నిఫ్టీ వెనక్కి తగ్గింది. ఇంట్రాడేలో మరో చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకిన నిఫ్టీ చివరకు 141.90 పాయింట్లు నష్టపోయి 22,055 పాయింట్ల వద్ద ముగిసింది.

- ఎన్‌టీపీసీ 2.76 శాతం, పవర్‌గ్రిడ్ 2.71 శాతం పతనమయ్యాయి.
- వీటితోపాటు విప్రో, ఎల్‌అండ్‌టీ, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్, టీసీఎస్ షేర్లు ఒక్క శాతం వరకు నష్టపోయాయి.
- కొటక్ బ్యాంక్, టైటాన్, ఐటీసీ, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.
- కానీ, టాటా స్టీల్, ఎస్బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, మహీంద్రా, నెస్లే, సన్‌ఫార్మా, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లు లాభాల్లో ముగిశాయి.
- 30 షేర్ల ఇండెక్స్‌లో 20 సూచీలు నష్టపోగా, పది సూచీలు లాభాల్లో ముగిశాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.27 శాతం పతనమవగా, స్మాల్‌క్యాప్ కూడా పతనం చెందాయి.
- రంగాలవారీగా చూస్తే యుటిలిటీ రంగ షేర్లు 2.10 శాతం తగ్గగా, ఆయిల్ అండ్ గ్యాస్ 1.78 శాతం, పవర్ 1.66 శాతం చొప్పున పతనం చెందాయి. టెక్, సర్వీసులు, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లు కూడా దిగువకు పడిపోయాయి.

సూచీలు దిద్దుబాటులో ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన సూచీలు ప్రస్తుతం వెనక్కితగ్గుతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు మినిట్స్ కోసం గ్లోబల్ మార్కెట్లు వేచి చూస్తున్నాయి. జనవరి నెలలో అమెరికా ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో త్వరలో ఫెడ్ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయని పెట్టుబడిదారులు భావిస్తున్నారు.

వినోద్ నాయర్,
జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసర్చ్ హెడ్

జీతాల పెరుగుదల తక్కువే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: దేశంలో ఈ ఏడాది ఉద్యోగుల జీతాల వార్షిక పెరుగుదల ఏక అంకెకే పరిమితం కానుంది. అంతేకాకుండా గత ఏడాది కంటే వేతనాల పెంపును కంపెనీలు స్వల్పంగా తగ్గించనున్నాయి. 2023లో 9.7 శాతం ఇంక్రిమెంటల్ సేలరీ అందుకున్న ఉద్యోగులకు 2024లో సగటు పెంపు 9.5 శాతం ఉంటుందని గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ కంపెనీ అయాన్ వెల్లడించింది. కొవిడ్ పాండమిక్ తర్వాత 2022లో భారీ ఇంక్రిమెంట్లు ఉద్యోగులకు లభించినప్పటికీ, 2023-24 సంవత్సరానికి దాదాపు 45 పరిశ్రమల్లో 1,414 కంపెనీల టర్నోవర్, వేతనాల పెంపుపై అయాన్ ఒక సర్వే నిర్వహించింది. ఈ సర్వేను విశ్లేషించిన అయాన్.. భారత్‌లో వేతన పెంపుదల హై సింగిల్ డిజిట్ వద్ద స్థిరపడినట్టు పేర్కొంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమ ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటిలోకి ఇండియాలో వేతనాల పెంపు అధికంగా ఉన్నదని తెలిపింది. జీతాల పెంపులో భారత్ తర్వాతి స్థానాల్లో బంగ్లాదేశ్ (7.3 శాతం), ఇండోనేషియా (6.5 శాతం) లు నిలిచాయి. ఉద్యోగుల వలసలు తగ్గాయని, 2022లో అత్యధికస్థాయిలో 21.4 శాతం మేర ఉన్న వలసల రేటు 2023లో 18.7 శాతానికి తగ్గిందని, దీంతో జాబ్ మార్కెట్ కాంపిటీటివ్‌గా మారిందని అయాన్ సర్వే పేర్కొంది. వలసల రేటు తగ్గడంతో ఉద్యోగుల సామర్థ్యాన్ని, ఉత్పాదకతను పెంచుకోవడంపై కంపెనీలు దృష్టి నిలిపాయన్నది. 2023లో కంపెనీలు సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొని, హై సింగిల్ డిజిట్‌లో వేతనాల్ని పెంచగలిగాయని అయాన్ తెలిపింది. గ్లోబల్ సెంటిమెంట్ అంతంతమాత్రంగా ఉన్న తరుణంలో మౌలిక వసతులు, తయారీ వంటి రంగాలు మంచి వృద్ధిని కనపరుస్తున్నాయని, ఆయా రంగాల్లో అధిక పెట్టుబడులు జరుగుతాయని అయాన్ టాలెంట్ సొల్యూషన్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ రూపాంక్ చౌదరి చెప్పారు.

టైమ్‌కొస్తే చాలదు.. పని చేయాలి

దేశంలో మెజారిటీ కంపెనీల మాట • ఓ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: టైమ్‌కొస్తే చాలదు.. పని చేయాలని కంపెనీలు అంటున్నాయి. ఉత్పాదకత మదింపు కోసం సమయపాలన కంటే నాణ్యమైన పనే ముఖ్యమని దేశంలోని మెజారిటీ సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. సంప్రదాయ కాలం ఆధారిత కొలమానాల కన్నా ఉద్యోగుల నుంచి మెరుగైన పనిని రాబట్టుకోవడానికి రివార్డులు, గుర్తింపులు చాలా అవసరమని స్పష్టం చేస్తున్నాయి. ఉద్యోగాలు, నిపుణుల నెట్‌వర్కింగ్ వేదిక అప్నా.కో నిర్వహించిన ఓ తాజా అధ్యయనంలో 10 సంస్థల్లో 7 ఇదే మాట చెప్తున్నాయిమరి. నాణ్యమైన పని, టార్గెట్లు, ప్రాజెక్టు పూర్తయిన విధానం వంటివి ఉద్యోగుల సామర్థ్యానికి గీటురాళ్లు అని 77 శాతం సంస్థల యాజమాన్యాలు పేర్కొన్నాయి. మొత్తానికి కార్యాలయాలకు లేదా పని స్థలాలకు నిర్దేశించిన సమయానికి వచ్చి పని చేయకపోతే ఏం లాభం అన్న రీతిలో ఈ సర్వేలో ఫలితం వెలువడింది. ఇకపోతే పది సంస్థల్లో ఐదు కంపెనీలు.. పని గంటల్లో శిక్షణ, అభివృద్ధి, రెగ్యులర్ ఫీడ్‌బ్యాక్‌కు ప్రాధాన్యాన్ని ఇస్తున్నాయి. ఈ సర్వేలో 5వేలకుపైగా సంస్థలు పాల్గొన్నాయి. 'రోజూ సమయానికి పంచ్ కొట్టాలి, విరామం తీసుకోకుండా.. సెలవులు పెట్టకుండా పనిచేయాలని ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్న కంపెనీలతోపాటు ఇందుకు భిన్నంగా ప్రభావవంతమైన పని సంస్కృతిని పెంపొందించడానికి కంపెనీలు అనుసరిస్తున్న వ్యూహాలపైనా మా సర్వేలో దృష్టి పెట్టాం' అని ఈ సందర్భంగా అప్నా.కో వ్యవస్థాపక సీఈవో నిర్మిత్ పరీఖ్ తెలిపారు.

టీ హబ్ స్టార్టప్‌లకు హెక్సాగాన్ దన్ను

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రముఖ జియోస్పేషియల్, ఇండస్ట్రియల్ టెక్నాలజీస్ కంపెనీ హెక్సాగాన్ సీసీఐ...టీహబ్‌తో కలిసి స్టార్టప్ క్యాటలిస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకుగాను నిర్వహించిన ఈ కార్యక్రమంలో 12 స్టార్టప్‌లను ఎంపికచేశారు. 100 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో డిజిటల్ ట్విన్, రియల్ టైమ్ లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ అంశాల్లో స్టార్టప్‌లలో కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

ఆల్గోర్యాండ్ స్టార్టప్ ల్యాబ్

బ్లాక్ చైన్ టెక్నాలజీతో స్టార్టప్ కార్యకలాపాలను నిర్వహించే వారిని ప్రోత్సహించేందుకు టీ హబ్‌లో ఆల్గోర్యాండ్ స్టార్టప్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని టీహబ్ ప్రతినిధి తెలిపారు. ఎంపిక చేసిన స్టార్టప్‌లకు ప్రొడక్ట్, మార్కెట్- ఫండింగ్ అంశాల్లో నిపుణుల సహకారంతోపాటు మద్దతును అందించేలా ఆల్గోర్యాండ్ స్టార్టప్ ల్యాబ్ పనిచేస్తుందని తెలిపారు. వివరాలకు (https://programs.t-hub.co/ algorand - start up-lab/)లో సంప్రదించాలని సూచించారు.